# ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌ల జారీలో జాప్యం

**మూడు నెలలుగా ఎదురు చూపులు కొర్రీలతో ఇబ్బందులు**

వరంగల్, మే 18: ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌ల జారీలో తీవ్ర జాప్యం.. మూడు నెలలుగా ఎదురుచూపులు.. డబ్బులు చెల్లించి నెలలు గడుస్తున్నా అనేక కొర్రీలు పెడుతున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో లక్షా మూడు వేల మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో సుమారు 30 వేలకు పైగా వెయ్యి రూపాయలు చెల్లించారు. వారిలో ఇప్పటి వరకు కేవలం 5 వేల మందికి మాత్రమే ప్రొసీడింగ్‌లు జారీ చేశారు. మిగతా వారు ప్రొసీడింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. వారంతా కార్పొరేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ఎవరిని అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు చెల్లించి మూడు నెలలుగా ఎదురు చూస్తున్నామని వాపోతున్నారు.

**కొర్రీలతో ఇబ్బందులు..**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వెరిఫికేషన్‌లో అనేక కొర్రీలతో ఇబ్బందులు పెడుతున్నారని దరఖాస్తుదారులు అంటున్నారు. ఫీజులు చెల్లించే సమయంలో అన్ని సరిగా ఉన్నాయని చెప్పిన అధికారులే ఇప్పుడు బఫర్ జోన్, నాలా దగ్గరగా ఉన్నది.. ప్రభుత్వ భూమి అంటూ కొర్రీలు పెడుతున్నారు. వెరిఫికేషన్ అధికారులు షార్ట్‌ఫాల్ పేరిట నోటీసులు ఇస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మార్చి 31లోగా వెరిఫికేషన్ చేయకుండానే ముందుగా ఫీజులు చెల్లించారు. ఇప్పుడు వెరిఫికేషన్ పేరిట ప్రొసీడింగ్‌లు జారీ చేయడం లేదని వాపోతున్నారు.

**మూడు నెలలుగా ఎదురుచూపు..**

డబ్బులు చెల్లించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వెరిఫికేషన్ చేయని దరఖాస్తులు వేలల్లో ఉన్నాయి. మూడు శాఖల అధికారులు వెరిఫికేషన్ ఓకే చేసిన తర్వాత ప్రొసీడింగ్ జారీ చేస్తారు. అయితే మూడు శాఖల మధ్య సమన్వయం లోపంతో ఎల్–2లో వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు వెంటవెంటనే వెరిఫికేషన్ పూర్తి చేసి ప్రొసీడింగ్‌లు జారీ చేయాల్సిన అవసరం ఉంది.



కరీమాబాద్: నిరసన తెలుపుతున్న పద్మశాలీ నాయకులు

# నరేందర్ అరెస్టును ఖండించిన నాయకులు

కాశీబుగ్గ, మే 18: వరంగల్ 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ అరెస్టును బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఒక ప్రకటనలో ఖండించారు. రాజకీయ కక్ష సాధింపుతో నరేందర్‌ను అక్రమంగా అరెస్టు చేయించి మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టడం సరికాదన్నారు. వెంటనే వరంగల్ సీపీ స్పందించి నరేంద్రకుమార్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**పలు పద్మశాలీ సంఘాల మద్దతు**

కార్పొరేటర్ గుండేటి నరేందర్ రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని పలువురు పద్మశాలీ సంఘం నాయకులు ఆరోపించారు. ఒక బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం సరికాదన్నారు. వెంటనే విడుదల చేయాలని, లేకుంటే నరేందర్‌కు మద్దతుగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

**నరేందర్ అరెస్టు హాస్యాస్పదం**

ఖిలావరంగల్: వరంగల్ 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై అక్రమ కేసులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ ఒక ప్రకటనలో తెలిపారు. విలువలతో కూడిన రాజకీయ నాయకుడు నరేందర్‌పై సొంత పార్టీ నాయకులే రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

**ఉద్దేశపూర్వకంగానే కేసు**

వరంగల్, మే 18: మంత్రి కొండా సురేఖ ఆగడాలు మితిమీరిపోతున్నాయని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువంటారని, ఇదేనా స్వేచ్ఛ అని ప్రశ్నించారు. కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై ఉద్దేశపూర్వకంగానే కేసు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వరంగల్‌లో మళ్లీ రౌడీ రాజకీయాలకు ఆజ్యం పోసిందన్నారు. సొంత పార్టీ నేతల పరిస్థితే ఇలా ఉంటే ప్రత్యర్థి పార్టీల పరిస్థితి ఏమిటని నిలదీశారు. వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**వెంటనే విడుదల చేయాలి'**

కరీమాబాద్: అక్రమంగా అరెస్టు చేసిన కార్పొరేటర్ గుండేటి నరేందర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఎదుట పద్మశాలీలు నిరసన తెలిపారు. కుట్రపూరితంగా కార్పొరేటర్‌ను అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఈ మేరకు సోమవారం నగరబంద్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు మూర్తి, కుసుమ సతీశ్, గోరంట్ల రాజు, మాచర్ల దీన్‌దయాల్, చిలువేరు రాజేందర్, బైరి శ్యామ్, కూచన క్రాంతి, గుండు కామేశ్వర్, ఆడెపు వెంకటేశ్, శామంతుల నిరంజన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★Hema Hyundai needs for workshop AC Tech - 1 & Junior Tech - 2 - ITI must, Washing Helper - 2 Quli : 10 pass for Jangaon & WGL, Washing Supervisor - 1 Quli : Any Degree Final Inspector - Quli : ITI must with min 10 yrs Exp Walk in Interview with resume on 19th & 20th May 2025 between 11 am to 2.pm. Cont : Hema Hyundai Service Shed No B-5, Industrial estate, Mulugu road, Wgl Cell : 97030 4868.
NTW-000

★Hema Motors needs Sales executive, any degree, Two wheeler must, Tele callers any degree, only females EDP, degree must, Walk in Interview with resume on 19th & 20th May 2025 between 11 am to 2.pm Cont : Hema Motors Pvt Ltd, Opp : Govt ITI, Mulugu Road, Wgl, Cell : 8008204442, 915492194.
NTW-000

**WANTED**

★Hema Motors needs Drivers. min.edu. qualification Inter. LMV driving licence with badge required. min 3-5 years of experience. Walk in Interview with resume on 19th & 20th May 2025 between 11 am to 2.pm Cont : Hema Motors Pvt Ltd, Opp : Govt ITI, Mulugu Road, Wgl, Cell : 8008204442, 915492194.
NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# పారదర్శకంగా ధాన్యం సేకరణ చేపట్టాలి

- కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- కాంటాలైన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి
- కలెక్టర్ సత్యశారద



చెన్నారావుపేట: కొనుగోలు కేంద్రంలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

నర్సంపేట, మే 18: రైతులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ చేపట్టాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మండలంలోని ముగ్దుంపురం శివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నాణ్యత, రైతుల అవసరాలు, డబ్బుల చెల్లింపు తదితర అంశాలను ఆమె పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కాంటాలైన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, గన్నీ బ్యాగులు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం రవాణాకు సరిపడా వాహనాలు, ధాన్యం ఎగుమతులు, దిగుమతులను వెంటనే జరిగేలా హమాలీలను సమకూర్చుకోవాలని సూచించారు. రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు సకాలంలో పడేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డీఏవో అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, ఏఈవో మెండు అశోక్, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

**ధాన్యం డబ్బులు అందించేలా చర్యలు తీసుకోవాలి**

నెక్కొండ/చెన్నారావుపేట: ధాన్యం కొనుగోళ్లలో ఓపీఎంఎస్ డేటా ఎంట్రీ వెంటనే పూర్తి చేసి ధాన్యం డబ్బులు రైతులకు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తహసీల్దార్‌తో సమన్వయం చేసుకుంటూ హమాలీల సంఖ్య పెంచుకొని త్వరగా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. వడగండ్ల వర్షం, పిడుగులు, ఉరుములు ఉన్నప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అందరూ చెప్పులు ధరించాలని, చెట్ల కింద ఉండొద్దని, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలని సూచించారు. ఆమె వెంట డీఎంవో సురేఖ, ఏడీఆర్‌డీవో రేణుకాదేవి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో నాగరాజు, ఏపీఎంలు శ్రీనివాస్, సుధాకర్, సీసీ రవీందర్, ఏఈవో వసంత ఉన్నారు. అలాగే, చెన్నారావుపేటతోపాటు పాపయ్యపేట, జల్లి గ్రామంలోని రైస్ మిల్లులను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. మ్యాచర్ మిషన్‌లో లోపాలు ఉన్నాయని పలువురు రైతులు ఆరోపించగా, వెంటనే మిషన్‌ను తనిఖీకి పంపించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జల్లి రైస్ మిల్లులో రికార్డులను పరిశీలించి, సకాలంలో లోడింగ్, అన్‌లోడింగ్ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నీరజ, పౌర సరఫరాల అధికారి కృష్ణయ్య, తహసీల్దార్ ఫణికుమార్, ఆర్ఐ రషీద్, సీఈవో చిట్టి రవి, ట్రైనీ ఎస్సై రోహిత్ ఉన్నారు.

**టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలి**

సంగెం: వర్షం వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. మండలంలోని కాపులకనపర్తి సొసైటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల వివరాలు, రికార్డులను పరిశీలించారు. బిల్లుల చెల్లింపుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏఈవో లావణ్య, సీఈవో రమణాచారి ఉన్నారు.

## క్యాండిల్ లైట్ మెమోరియల్ డే ర్యాలీ

వరంగల్‌చౌరస్తా, మే 18: అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేను పురస్కరించుకొని వరంగల్ ఐఎంఏ హాల్ నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు ఆదివారం రాత్రి క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు ర్యాలీని ప్రారంభించారు. ఎయిడ్స్‌తో మరణించిన వారిని స్మరించుకుంటూ ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం, బాధితులకు సంఘీభావంగా నిలవడంతోపాటు వారి కుటుంబాలకు మద్దతుగా నిలిచేందుకు 1983 నుంచి క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

## ఠాణా సమీపంలో చైన్‌స్నాచింగ్

వరంగల్ చౌరస్తా, మే 18: మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రామన్నపేట ప్రాంతానికి చెందిన రేకులపల్లి నర్సమ్మ(78) శనివారం రాత్రి ఇంట్లో నిద్రించింది. సుమారు రాత్రి 3 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి తలుపుతట్టి 'నేను రాజును వచ్చాను. తలుపు తీయమ్మ' అనడంతో తలుపులు తెరిచింది. వెంటనే దుండగుడు వృద్ధురాలి మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. అతడిని పట్టుకునే క్రమంలో వృద్ధురాలు గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే.. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే చైన్‌స్నాచింగ్ జరగడంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. పెట్రోలింగ్ సరిగా లేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సత్యశారద

## హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**అధికారులతో కలెక్టర్ సత్యశారద సమీక్ష**

వరంగల్‌చౌరస్తా, మే 18: వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో గడువులోగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. ఆదివారం ఆమె దవాఖానలోని బ్లాక్‌లతోపాటు ధర్మశాల, యుటిలిటీ బ్లాక్, కిచెన్, డైనింగ్, సెక్యూరిటీ, లాండ్రీ తదితర పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. నిర్మాణ సంస్థ ప్రతినిధులు వివరాలు తెలియజేస్తూ భవన నిర్మాణం, స్టామ్ డ్రైన్ పనులు పూర్తయ్యాయని, మాసోనరీ పనులు 86 శాతం, మెకానికల్, ఎలక్ట్రికల్ ప్లంబింగ్ పనులు 78 శాతం పూర్తయ్యాయని వివరించారు. ఎంజీఎం హాస్పిటల్ వైద్యాధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ విభాగాల వారీగా మెడికల్ పరికరాలు ఎక్కడ అమర్చాలో నిర్ణయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ఆర్ అండ్‌బీ ఎస్ఈ నాగేంద్ర, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఎల్అండ్‌టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## దాడి చేసిన ఒకరిపై కేసు

సంగెం, మే 18: యువకుడిపై దాడి చేసిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మండలంలోని ఎల్గూర్‌రంగంపేటకు చెందిన వడ్లకొండ శివ తన మిత్రులతో కలిసి ఈ నెల 16న పల్లెప్రకృతి వనంలో కూర్చొని మాట్లాడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన జనగాం క్రాంతి వారి వద్దకు వచ్చి గతంలో జరిగిన ఘటనపై వడ్లకొండ శివను కొట్టాడు. శివ మిత్రులు క్రాంతిని ఆపారు. ఈ విషయాన్ని క్రాంతి తండ్రి సుదర్శన్‌కు చెప్పేందుకు శివ వెళ్లాడు. ఈ క్రమంలో క్రాంతి ఇంట్లో నుంచి వచ్చి శివను గట్టిగా కొట్టాడు. దీంతో కిందపడిపోయిన శివను అతడి స్నేహితులు దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు క్రాంతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రిటైర్డ్ హెచ్ఎం శ్రీధర్‌కు జాతీయ అవార్డు

ఖిలావరంగల్, మే 18: డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దోమన చిన్నారావు ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలోని కళామంచ్ ఆడిటోరియంలో శివనగర్‌కు చెందిన రిటైర్డ్ హెచ్ఎం కొమ్మోజు శ్రీధర్‌కు 2025 జాతీయ అవార్డు అందించారు. వివిధ విశ్వవిద్యాలయాల నుంచి 30 మందికి గౌరవ డాక్టరేట్లు, 20 మందికి జాతీయ అవార్డులు ప్రదానం చేసిన సంస్థ ప్రతినిధులు శ్రీధర్ చేసిన విద్యా, సాహిత్య సేవలను గుర్తించి ఢిల్లీకి ఆహ్వానించారు. ఈ నెల 17న ఢిల్లీలో సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఎస్ కే రహమాన్, నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ దాడి సత్యనారాయణ, ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది శ్రీనివాసరావు చేతులమీదుగా శ్రీధర్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు అందించి సత్కరించారు.

**వాహనం ఢీకొని వృద్ధుడి మృతి**

కరీమాబాద్, మే 18: సెప్టిక్‌ట్యాంకు క్లీనర్ వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఆదివారం మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లీపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లోని సెప్టిక్ ట్యాంక్‌ను క్లీన్ చేసేందుకు వాహనం తీసుకొచ్చాడు. అదే కాలనీకి చెందిన కొత్తపెల్లి యాకయ్య(75) చెడు వాసన వస్తున్నదని చూసేందుకు వెళ్లగా సెప్టిక్‌ట్యాంకు క్లీనర్ వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

# ఉద్యమజీవి నల్లెల్ల రాజయ్య

- రాజయ్య పయనం ఆదర్శనీయం
- ప్రముఖ కవి డాక్టర్ అంపశయ్య నవీన్

పోచమ్మమైదాన్, మే 18: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నల్లెల్ల రాజయ్య చురుగ్గా పాల్గొని, ఓరుగల్లు ప్రజలను నిత్యం జాగురత పరిచారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. హనుమకొండలోని ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ప్రజల మనిషి నల్లెల్ల రాజయ్య రచనలు–మిత్రుల నివాళి వ్యాసాల సంపుటిని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత చందు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజయ్య శారీరక వైకల్యాన్ని జయించిన ఉద్యమ జీవి ఈ లోకం నుంచి వెళ్లిపోవడం బాధాకరమన్నారు. విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ బన్న ఐలయ్య మాట్లాడుతూ రాజయ్య ఒకసారి పరిచయమైతే అంత తొందరగా మరిచిపోయే వ్యక్తి కాదని, ఆయన మాటల్లో సంస్కారం, చేస్తున్న పనిలో చిత్తశుద్ధి, నమ్మిన సిద్ధాంతంపై అంకితభావం ఉందని కొనియాడారు. ఆయన నడిచిన దారులను వెలిగించిన తీరును మరువరానిదని, నిరంతరం ప్రశ్నించే తత్వాన్ని, ఎదిరించే స్వభావాన్ని అలవర్చుకున్న ఆయన పయనం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి వీఆర్ విద్యార్థి, తెలంగాణ ప్రజాఫ్రంట్ కన్వీనర్ బి.రమాదేవి, ప్రముఖ కవి కోడెం కుమారస్వామి, అనిశెట్టి రజిత, డాక్టర్ కేబీ చంద్రబాను, బిల్లా మహేందర్, పిట్ట సాంబయ్య, రౌతు అజయ్‌కుమార్, వివిధ సంఘాల బాధ్యులు డాక్టర్ ఎస్.తిరుపతయ్య, బి.భిక్షపతి, ఉదయ్‌సింగ్, రవీందర్, సారయ్య, శంకర్‌నారాయణ, కె.శంకర్‌రావు, దిలీప్, సుజాత, రాములు పాల్గొన్నారు.



మాధవిని సన్మానిస్తున్న నాయకులు

## జాగృతిని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలి

**తెలంగాణ జాగృతి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి**

కాశీబుగ్గ, మే 18: తెలంగాణ జాగృతి మహిళా సమాఖ్యను బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ 14వ డివిజన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీవోఏ) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ బాధ్యతలు అప్పగించినట్లు మాధవి తెలిపారు. అదే నమ్మకంతో జాగృతిని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లూరి తిరుపతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరి రాజశేఖర్, పత్రి సుభాష్, రాజపోశాలు, రమేశ్, విజయ, వెంకన్న, రాధ, భాస్కర్, సంజీవ్, సమ్మక్క, సరోజన, పున్నం ప్రభాకర్, అశోక్, సంతోష్‌కుమార్, రాజేశ్, సురేశ్, గౌసియా, పద్మ, ప్రేమలత పాల్గొన్నారు.

# నర్సింగాపురంలో తాగునీటి ఇక్కట్లు

**ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన మహిళలు**



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నర్సంపేట, మే 18: మండలంలోని నర్సింగాపురంలో ప్రజలు తాగునీటి ఇక్కట్లకు గురవుతున్నారు. ఇటుకాలపల్లి జీపీ పరిధిలోని నర్సింగాపురంలో సుమారు 550 జనాభా ఉంది. ఈ గ్రామానికి నల్లాల బావితోపాటు బోరు కూడా ఉంది. బావి నీళ్లు గ్రామంలోని మొదటి, చివరి కాలనీకి తాగునీటి సరఫరా జరుగుతున్నది. మధ్య కాలనీ(మద్దెవాడ) ప్రజలంతా తాగునీటి కోసం బోరుపై ఆధారపడుతున్నారు. మద్దెవాడలో 30 కుటుంబాలు ఉన్నాయి. గతేడాది మే నెలలో సీడీఎఫ్ నిధులతో ఈ కాలనీలో బోరు వేశారు. కానీ, కేసింగ్ సరిగ్గా వేయకపోవడంతో మూడు నెలలకే బోరు కూలిపోయింది. అప్పటి నుంచి కాలనీ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బోరుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. నిరసనలో ఈర్ల పద్మ, లింగదారి లావణ్య, భూసాని రాజమణి, గొర్రె విమల, గొర్రె రమనీల, బూస రాజక్క, భూసాని విజయ, అరుణ, గొర్రె లక్ష్మి పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పెద్ది పరామర్శ

నల్లబెల్లి, మే 18: మండలంలోని ముచ్చింపుల గ్రామానికి చెందిన బొట్ల రజిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకొని రజిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బానోత్ సారంగపాణి, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గందె శ్రీనివాస్‌గుప్తా, బొట్ల పవన్, సంతోష్‌గౌడ్ ఉన్నారు.



రజిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పెద్ది



చింతనెక్కొండలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎర్రబెల్లి

## కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

పర్వతగిరి, మే 18: మండలంలోని చింతనెక్కొండ గ్రామంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జీడిగట్టయ్య సోదరుడు జీడి శ్రీనివాస్ మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మాజీ వార్డు మెంబర్ అక్కల రాజు తండ్రి సూరయ్య మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాత ఏనుగల్‌లో మారబోయిన రమేశ్ కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ మనోజ్ కుమార్‌గౌడ్, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయినపల్లి యుగేంధర్‌రావు, ఎంపీటీసీ కరిమిళ్ల మోహన్‌రావు, సీనియర్ నాయకులు తక్కళ్లపల్లి భాస్కర్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గంధం బాలరాజు, డాక్టర్ లింగమూర్తి, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా రవి, చింత నెక్కొండ మాజీ ఉపసర్పంచ్ దేవేందర్, నాయకులు జీడి గట్టయ్య, మౌనికా రాజు, సుభాషిణీ వాసు, దబ్బెట యాలాద్రి, దబ్బెట నరేశ్, జీడి ప్రసాద్, మాసాని వెంకట్, తొర్రి లక్ష్మణ్ ఉన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్ద

## వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

**ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ**

పోచమ్మమైదాన్, మే 18: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేసే వరకూ ఉద్యమిస్తామని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. వరంగల్ ఇస్లామియా గ్రౌండ్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అతీక్ రహమాన్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ మైనార్టీలకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అమ్ముతున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎంపీ అజీజ్‌పాషా, జిల్లా కన్వీనర్ మౌలానా ఫసియొద్దీన్ ఖాస్మీ, మౌలానా ఖాలీద్ సైపుల్ల రెహమాన్, మహ్మద్ అబ్దుల్, సుభాన్, డాక్టర్ అనీస్ సిద్దికి, సయ్యద్ సుభాన్, ముత్తూరు కృష్ణ, మత పెద్దలు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

**బహిరంగ సభలో గందరగోళం**


వరంగల్ ఇస్లామియా కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఆలిండియా పర్సనల్ లా బోర్డు బహిరంగ సభలో నాయకుల మధ్య గందరగోళం నెలకొంది. సభలో తమకు సరైన ప్రాధాన్యం కల్పించడం లేదంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య గొడవకు దారితీసింది. ఒక దశలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. వేదికపై ఉన్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సమక్షంలోనే మైనార్టీ నాయకుల మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. చివరకు పలువురు మతపెద్దలు నచ్చచెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది.

## మద్యం మత్తులో అర్చకుడిపై దాడి



మద్యం మత్తులో స్థానికులకు చిక్కిన యువకుడు

పోచమ్మమైదాన్, మే 18: వరంగల్ దేశాయిపేట లక్ష్మీ మెగా టౌన్‌షిప్ రోడ్డులోని సాయిబాబా ఆలయ అర్చకుడిగా పని చేస్తున్న సోమేశ్వరశర్మపై మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు దాడి చేసిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడి కథనం ప్రకారం.. సోమేశ్వర శర్మ బైక్‌పై సాయిబాబా ఆలయానికి వెళ్తున్న క్రమంలో సీకేఎం కళాశాల వద్ద కాశీబుగ్గ, లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు మద్యం మత్తులో ఆపారు. అనంతరం అతడిపై దాడి చేసి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకుని పగులగొట్టారు. దీంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఇద్దరు పారిపోయారు. మరో వ్యక్తి స్థానికులకు చిక్కాడు. సదరు వ్యక్తి తాగిన మైకంలో మాట్లాడుతూ వీరంగం సృష్టించాడు. తన పేరు పులి అంటూ గొడవకు దిగాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంతెజార్‌గంజ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న వ్యక్తిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అర్చకుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



గీసుగొండ: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మారెడ్డి

## బాధిత కుటుంబాలకు చల్లా పరామర్శ

గీసుగొండ/సంగెం, మే 18: గీసుగొండ మండలంలోని ఆరెపల్లిలో వివిధ కారణాలతో మృతి చెందిన లకిడె మధురాబాయి, నాగుర్ల బక్కయ్య కుటుంబాలను ఆదివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, బలరాజు, నాగరాణి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. అలాగే, సంగెం మండలంలోని కోట వెంకటాపురం గ్రామానికి చెందిన అల్లం భాస్కర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. చల్లా ధర్మారెడ్డి గ్రామానికి చేరుకొని భాస్కర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు శరణ్యారెడ్డి ఉన్నారు.

**రంగశాయిపేటలో రక్తదాన శిబిరం**

కరీమాబాద్, మే 18: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఆదివారం రంగశాయిపేట ప్రభుత్వ కళాశాలలో వాగ్బాట యోగా, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలిచేందుకు రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వాగ్బాట యోగా, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

**యాచకులు, బాటసారులకు ఆహారం పంపిణీ**

పోచమ్మమైదాన్, మే 18: వరంగల్ దేశాయిపేట, ఎల్‌బీనగర్‌లోని స్లమ్ ఏరియాలో రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని జీవిస్తున్న వారికి ఆదివారం ఆహారం పంపిణీ చేశారు. సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శుభకార్యాల నుంచి సేకరించిన ఆహారాన్ని ఆకలితో అలమటిస్తున్న యాచకులు, బాటసారులకు అందజేశారు. శుభకార్యాల్లో మిగిలిన ఆహార పదార్థాలు అందజేయాలనుకునే వారు 70973 63045 సెల్ నంబర్‌కు సమాచారం అందించాలని సంస్థ వ్యవస్థాపకుడు ఎలుకపల్లి శ్రీధర్ కోరారు.